# ఓ నీతి కథ

(19.2)

సాయంకాలం ఆరుగంటలైంది- మల్లె పందిరకు, క్రోటన్ మొక్కలకూ మధ్య ఆరుబయట పట్టె మంచం వేసుకుని కూర్చుంది వర్ధనమ్మ- ఆమె చేతిలో గీతా మకరందం- ఈ మధ్య సాయంకాలాలు ప్రశాంతంగా వుంటున్నాయి- అందుకే గీతా సారాన్ని వంట బట్టించుకోవాలని ఆమె తాపత్రయం.

చీకటిపడే వరకే ఆ గీతా పారాయణం- తర్వాత ప్రకాశం వస్తాడు. పిల్లలతో ఆటలాడతాడు- వాళ్ళతో పాటే పాఠాలు చదువుతాడు- చూడముచ్చటగా వుంటుందా వాతావరణం.

"డాడీ ఇవాళ ఆలస్యంగా వస్తారట బామ్మా ఫోన్‌చేసి చెప్పేరు" అంటూ వచ్చింది అపర్ణ.

కాఫీ కలర్ పరికిణీ; అదే రంగు జాకెట్టూ పాలమీగడలాంటి ఓణీ.... జడకు జడగంటలూ.... వెన్నెల, బంగారం కలిపి మరిగించి చేసిన బొమ్మలా వుంది అపర్ణ.

ప్రకాశానికి అపర్ణంటే ముద్దు- ఆ అమ్మాయి తర్వాత యిద్దరు మగపిల్లలు కలిగినా కూతురంటేనే అభిమానమతనికి.

ఎదురింటి డాబామీద ఇరవైఏళ్ళ హిప్పీ కటింగ్ కుర్రాడు పిట్టగోడమీద కూర్చొని ఫ్లూటు వాయిస్తున్నాడు- ఏరిన మల్లెలను ఒళ్ళో వేసుకుని మాలకడుతూ అప్పుడప్పుడు అటువంక చూస్తోంది అపర్ణ- నాలుగైదు రోజులుగా అపర్ణను గమనిస్తూనే వుంది వర్ధనమ్మ-

"అక్కా- అక్కా-- నాకీ కథ చెప్పవూ." అంటూ ఓ పుస్తకాన్ని తీసుకొచ్చి అపర్ణ దగ్గర కూర్చున్నాడు శీనుగాడు-

"పోరా- నీకెప్పుడూ కథలే- నువ్వే చదువుకోలేవూ" విసుక్కుంది అపర్ణ.

"పోనీ చెప్పరాదుటే- కుర్ర వెధవ అడగడమే చాలు. ఆ వయసులోని పిల్లలు చదూకోమంటే బేటూ బంతీ పట్టుకుని వీధిలోకి పోతారు" అంది వర్ధనమ్మ కలుగ జేసుకుని-

శీనుగాడి చేతిలోంచి పుస్తకం తీసుకుంది అపర్ణ- శీనుగాడు బాసింపీట వేసుకుని అక్క ముఖంలోకి చూస్తున్నాడు- దూరంనుండి ఫ్లూటు వాయిద్యం సన్నగా విన్పిస్తోంది- అపర్ణ కథ చెప్పడం మొదలు పెట్టింది-

వర్ధనమ్మగారికి భగవద్గీతలో మనసు లగ్నం కావటంలేదు- అపర్ణ చెబుతున్న నీతికథ వింటూంటే ఎప్పటి సంఘటనలో మనసులో మెదుల్తున్నాయి-

"-నా అడవిలోని గడ్డిని నువ్వు తిన్నావు కాబట్టి నిన్ను కూడ నేను తినవలసిందే- అని ఘర్జించిందా పులి. తన మీద అధారపడ్డ ఓ ప్రాణి యింటి దగ్గర వుందనీ; దానికి పాలిచ్చి; దాని బాగుచూసి మళ్ళీ వస్తాననీ అప్పుడు తినవచ్చుననీ నచ్చజెప్పింది ఆవు- ఒట్టు వేయించు కున్నాకగాని వదలలేదా పులి-

ఆవు, పులి కథను అందంగా టూకీగా చెబుతోంది అపర్ణ.

గీతా మకరందాన్ని మూసేసింది వర్ధనమ్మ- ఫ్లూటు వాయిద్యం ఆగిపోయింది-ఆకాశంమీది వెలుగుకూడ నెమ్మదిగా మాయమైంది-

"-అన్న మాట ప్రకారం నువ్వు నాకు ఇహారమవడానికి తిరిగి వచ్చావు కాబట్టి నీ నిజాయితీకి మెచ్చి నిన్ను నేను తినకుండా విడిచి పెట్టేస్తున్నాను- పోయి నీ పిల్లతో పాటు హాయిగా వుండు" అన్నదా పులి- ఆనందంతో గెంతుకుంటూ వెళ్ళిపోయిందా ఆవు.

'అదీ కథ- ఇకపోయి నీ పాఠాలు చదువుకో.' అంటూ లేచింది అపర్ణ.

సంధ్య వెలుగు కూడ పూర్తిగాపోయి; దాని స్థానంలో మసగ వెన్నెల పరుచుకుంది-

వర్ధనమ్మ మనోసరోవరంలో అలలు కదిలాయి-

గతం కదిలితే చీకటి అలలు!

అపర్ణను నెమ్మదిగా దగ్గరకు పిలిచింది వర్ధనమ్మ-

'ఎందుకు బామ్మా' అంటూ వచ్చి మంచంమీద ఆమె పక్కనే కూర్చుంది అపర్ణ.

'శీనుగాడికి నువ్వు చెప్పిన కథలో నీతేమిటో తెల్సా అపర్ణా' అనడిగింది-

'భలేదానివే బామ్మా- ఆ మాత్రం తెలీదా. ఆడినమాట తప్పకుండా; అబద్దం చెప్పకుండా వుంటే తప్పకుండా మేలు జరుగుతుందీ అని-

"పిచ్చిపిల్లా అది కథ- పైగా ఎప్పటిదో నా చిన్ననాటి పాత కథ- అప్పటికీ యిప్పటికీ సమాజంలో ఎన్నో మార్పులొచ్చాయి- సంఘ నీతులు కూడ మారాయి. అవునా?" అంది వర్ధనమ్మ.

"అవునుగానీ నీతి నీతేగా? ఆడినమాట తప్పడం యీ రోజుకీ మంచిపని కాదుగా"

"ఈ నీతులున్నవి. మనిషిలోని సత్ప్రవర్తనని పెంపొందించడానికి ఏర్పడినవేనమ్మా- వాటి ప్రచారానికి పూర్వకాలంలో కథల్లేరు-"

"అంటే యీ నీతికథలన్నీ కేవలం కల్పనలేనా బామ్మా వాటిల్లో వాస్తవం లేదంటావా?"

"ఉండొచ్చు- లేకపోనూ వచ్చు. నువ్వు చెప్పిన కథలో రెండూ జంతువులు కాబట్టి ఆ కథ అలా వుంది- అదే కథ మనుషుల మధ్య జరిగి వుంటే అదెలా వుంటుందో వూహించగలనా? నువ్వు చెప్పిన కథ కేవలం శీనుగాడి వయసులో వున్న పిల్లలకోసం. మరి...వయసు, మనసు వికసిస్తున్న నీలాంటి వారికోసం మరో కథ చెబుతాను విను-"

అంటూ దిండుకు జారబడింది వర్దనమ్మ- బామ్మ చెప్పే కథకోసం ఆసక్తిగా ఆమె వంకే చూస్తోంది అపర్ణ.

"మాధవయ్యగారు సంస్కృతము, వేదము బాగా తెల్సినవారు- కానీ బడిలో మాత్రం చాలీచాలని జీతానికి అమ్ముడుపోయిన ఒక తెలుగు మాష్టారు మాత్రమే- చయసులో వుండగానే భార్య గతిస్తే ఒక్కగానొక్క కూతురైన వసంతను ముద్దుగా పెంచుకొచ్చారు. వసంత జీవితంలోకి పదహారు వసంతాలు వచ్చేనాటికి మాధవయ్యగారు అఆలు దిద్దించడానికి కూడ పనికిరాని బడిపంతులుగా రిటారయ్యారు-

మూడు గదుల పెంకుటిల్లు; మూడు పూటలా మేపినా పావు సేరు పాలు కూడ యివ్వని ఒక్క ఆవు మాత్రమే ఆయనకున్న ఆస్తులు,

రిటారైనాక ఆయన గుండెల్లో దిగులు పెరుగుతూ వచ్చింది- జీవిత చరమాంకంలో వున్నాడతడు- జీవితాన్ని అనుభవించాల్సిన వయసులో వుంది వసంత- వసంతకు తను పెళ్ళి చేయగలడా? తనకున్న ఆస్తిపాస్తులన్నీ అమ్మినా వసంత మెళ్ళోకి ఒక గొలుసు కూడ రాదు- ఇక పెళ్ళెట్లా జరుగుతుంది ?ప్రతినిత్యం ఆయన మనసులో యివే ఆలోచనలు.

తండ్రి మనసులోని మథనాన్ని అర్థం చేసుకోగలిగేది వసంత- ఆమె మనసులో కూడ భవిష్యత్తును గూర్చిన ఆరాటం, ఆశ మొదలయ్యేవి అప్పుడప్పుడు- ముంగిట్లో నిత్యం పూసే ముద్దమందారం లాగానూ; పెరట్లో జామిచెట్టు మీద వాలే రంగుల రామచిలకలానూ తనూ యీ పేదరికాని కతీతంగా వుండాలనుకునేది- ఏగిరేపిట్టల్నీ; కదిలే మబ్బుల్నీ, సూర్యోదయాల్నీ, సూర్యాస్తమయాల్నీ చూస్తూ జీవితం గడిపేయాలనుకునేది!

ప్రతి మనిషి జీవితంలోనూ ఎక్కడోక్కడ ఒక మలుపుంటుంది-

వసంత జీవితంలో ఆనందరావు ఒక మలుపును సృష్టించాడు- ఆనందరావు మాధవయ్యగారి శిష్యుడు- డిగ్రీయూ, ఉద్యోగమూ సంపాదించుకుని కొత్తగా వంటరిగా వచ్చాటా వూరు- నడిరోడ్డులో స్కూటర్ దిగి; 'మాష్టారూ నేను గుర్తున్నానా?' అని ఆనందరావు నమస్కరిస్తే మాధవయ్యగారు ఆశ్చర్యపోయారు- ఆ తర్వాత ఆనందించారు- 'మా యింటికోమారు రావోయ్' అని ఆహ్వానించారు-

అయితే మాష్టారి యింటికి వెళ్ళి ఆయన స్థితిని చూసి జాలిపడ్డ ఆనందరావే వసంతను చూసి ముచ్చటపడ్డాడు- ఆమెతో మాట్లాడానికి ఆరాటపడ్డాడు- తర్వాత పరిచయాన్ని పెంచుకోవానికి తాపత్రయ పడ్డాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ ఇటు శరీరస్థితీ; అటు ఆర్థిక పరిస్థితీ మాధవయ్యగార్ని బాగా దిగజార్చేయి- చివరికి మంచం దిగలేని స్థితిలో కొచ్చేశారాయన. ఆయన గుండెల్లో వైరాగ్యం- వసంత గుండెల్లో దిగులు!

'పెద్ద డాక్టరికి చూపించకపోతే కష్టమే' అని పెదవి విరిచేడు ఆయుర్వేద డాక్టరు- డాక్టరు ఫీజు, మందుల ఖర్చూ సుమారు రెండు మూడొందలు అవొచ్చని ఆయనే చెప్పాడు-

వసంతకేం చేయాలో పాలుపోలేదు- ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి- రెండు రోజులు ఆలోచనలతో సతమతమైంది. చివరికి ఆమెకు ఒకే ఒక దిక్కు కన్పించింది.

ఆనందరావు డబ్బున్నవాడు- మాష్టారంటే గౌరవాభిమానాలు వున్నవాడు- సమయానికి ఆదుకోకపోడు! ఒకటి రెండుమార్లు ఆనందరావు సహాయంచేయబోతే మాష్టారే స్వీకరించలేదు-కానీ యిది తప్పని సరి పరిస్థితి!

వసంత వెళ్ళేసరికి ఆనందరావు ఈజీఛెయిర్లో కూర్చొని సిగరెట్ కాలుస్తూ పాశ్చాత్య సంగీతం వింటున్నాడు. వసంతను చూసి అతను ముందు ఆశ్చర్యపోయేడు. ఆ తర్వాత ఆనందంతో అతిథి మర్యాదలు చేయబోయేడు- ప్రశ్నల వర్షం కురిపించేడు-

కానీ వసంత ఒక్కమాట కూడ మాట్లాడలేదు-ఆమెకా పరిస్థితి కొత్త. అందుకే తలొంచుకుని గోడదగ్గర నిలబడిపోయింది-

"ఏమిటి వసంతా మాట్లాడవూ? ఏమైందీ?" అన్నాడు ఆనందరావు చనువుగా, లాలనగా.

వసంత తలెత్తి అతనివంక చూసింది-ఆ కళ్ళలో నీళ్ళు పొంగేయి-వెక్కిళ్ళమధ్యే పరిస్థితిని విడమరచింది-

"ఛా. యీ మాత్రం దానికేనా?" అని ఓదార్చేడు.

"మీ సహాయం కోరి వచ్చాను. నాన్నగార్ని బతికించే శక్తి ఇప్పుడు మీ ఒక్కరికే వుంది" అంటూ బావురుమంది.

ఆనందరావు ఆమెపద్దకు నడిచేడు,తలనిమిరి కళ్ళు తుడిచాడు. పరిస్థితి తెల్సుకుని ధైర్యం చెప్పేడు-పర్సులోంచి రెండు వంద రూపాయల నోట్లుతీసి ఆమె చేతికిస్తూ కళ్ళు చిట్లించి ఒక నవ్వు నవ్వేడు-ఆ నవ్వుకు బిత్తరపోయి అతనివంకే చూస్తూ ఉండిపోయింది వసంత. ఆమె గుండెలు దడదడలాడేయి.

"మీరుణం తీర్చుకోలేను" అంది నెమ్మదిగా.

"ఎందుకు తీర్చుకోలేవూ. నువ్వు తల్చుకుంటే తప్పకుండా తీర్చగలవు." అంటూ దగ్గరగా వచ్చి ఆమె కళ్ళలోకి ఆశగా చూసి చేతిగాజులను సవరించబోయేడు ఆనందరావు-

ఒక్కమారు లోకమంతా చీకటైపోయినట్లనిపించింది వసంతకు- శరీరంలో వణుకు ప్రారంభమైంది-

అయినా ఆనందరావుమీద అసహ్యం కలగలేదామెకు- ఆపదలో

ఆదుకున్నవాడు దేముడితో సమానం-ఆ దేముడే తనిని కాంషిస్తే ఏం చేయగలదు? తన మానంకంటే తండ్రి ప్రాణమే ముఖ్యమనిపించిందా క్షణాన.

"మౌనం అర్ధాంగీకారం. అవునా" అంటూ ఆమె కళ్ళలోకి చిలిపిగా చూసేడు ఆనందరావు—

ఆతడు అందగాడు- అంతకు మించిన మాటకారి!

"మీయిష్టం...నాన్నగారికి కాస్త కుదుట పడ్డాక..." ఆపై మాట్లాడలేక పోయింది.

"ఓకే.ఓకే-ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు. మాష్టారు తిరిగి కోలుకోవాలి-అదే మనకి కావాల్సింది" అన్నాడు-

ఇంటికొచ్చి; గుండెల్లో పేరుకున్న దుఃఖమంతా కరిగిపోయేలా ఏడ్చింది వసంత. తనివితీరా ఏడ్చింది-

సరిగ్గా నెల్లాళ్ళ తర్వాత-ఓ సాయంత్రం-నారింజపండు రంగు చీరలో సంపెంగమొగ్గలాంటి వసంత తన గది గుమ్మం ముందు తలొంచుకుని నిలబడి వుండడం చూసేడు ఆనందరావు-ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

"ఏం వసంతా-నాన్నగారిప్పుడు పూర్తిగా కోలుకున్నట్లేనా?" అడిగేడు—

"ఆఁ. ఇప్పుడిప్పుడే లేచి తిరుగుతున్నారు" అంది వసంత.

"అదే అనుకున్నాను నిన్ను చూడగానే" చిలిపిగా చూశాడు.

వసంతేం మాట్లాడలేదు-

"ఇక్కడికొస్తున్నట్లు నాన్నగారితో చెప్పావా" అడిగాడు. ఆ

ప్రశ్నలో కొంచెం వేదనముంది-వసంత మాత్రం యీమారు నిశ్చలంగా అతని వంకచూసి;

"లేదు-మొదటిసారిగా అబద్ధం చెప్పాను-అదీ మీకిచ్చిన మాట కోసం" అంది-చిన్నప్పట్నించీ ఎన్నో నీతికథలు చదివి, విని వాటి ల్లోని నీతి నిజాయితీలను వంటబట్టించుకున్న వసంత—

ఆనందరావు అబ్బురపడ్డాడామె నిజాయితీకి. ఆమె నెంతగానో మెచ్చుకున్నాడు—

అయితే ఆవూ పులీ కథలో వసంత ఆవుకావొచ్చు-కానీ ఆనందరావు మాత్రం పులి కాదు-కాబట్టే ఆమెను వదిలిపెట్టలేదు!

0 0 0

బామ్మ చెప్పిన కథనువిన్న అపర్ణ కాస్సేపటి వరకూ ఏం మాట్లాడలేదు-ఆమె బుర్రలో ఏవేవో ఆలోచనలు!

"చూశావా. వాస్తవంలో మనుష్యులమధ్య వుండే నీతికీ. కథల్లో నీతికీ ఎంత వ్యత్యాసమో" అంది వర్ధనమ్మ మనమరాలి వంక చూస్తూ—

అపర్ణ తలూకొట్టి ఎదురింటి డాబామీది అబ్బాయి వైపు చూడ బోయి, ఆ ప్రయత్నాన్ని విరమించుకుని లోపలికి నడిచింది—

"అపర్ణ తెలివైన పిల్లే-ఆ మాత్రం ఆలోచించగలదు" అను కుంటూ ఆకాశం వంకచూసింది వర్ధనమ్మ-చంద్రునిచుట్టూ వున్న మబ్బుతెరలు విడిపోతున్నాయి—

"మీరు అపర్ణకు చెప్పిన కథలో నాకు కొన్ని సందేహాలు కలి గాయి-అడగనా" అంటూ వచ్చింది అపర్ణ తల్లి శారద.

కోడలివంక ఓమారుచూపి "నువ్వూ విన్నావా శారదా" అంది—

విన్నానత్తయ్యా-ఏదో వయసు ప్రభావంవల్ల కోరకూడని కోరికే కోరినా; యిష్టపడ్డ అమ్మాయే కనుక వసంతని ఆనందరావు ఆ తర్వాతైనా పెళ్ళి చేసుకున్నట్టు కథముగిస్తే బాగుండేదనిపించింది-చదువుకున్నవాడు కాబట్టి కనీసం ఆ నిజాయితీ అయినా ఆనందరావుకి వుంటుందని నేననుకుంటున్నాను—" అని అత్తగారి వంక చూసింది శారద.

"నువ్వు చెప్పిందికూడ కథల ముగింపేనమ్మా-వసంత శీలం పోయిన నెల్లాళ్ళకు మాష్టారు పోయారు-మరో ఆర్నెల్లకు ఆనందరావుకి పెళ్ళయింది-వసంతతో కాదు. లక్షల్నీ లంకంత కొంపనీ తనతో తెచ్చుకున్న మరో వనజాక్షితో-"

"వసంతను మీకు తెలుసా అత్తయ్యా?" సందేహిస్తూనే అడిగింది శారద-

"తెలుసమ్మా- ఆ వసంతే గుండెను రాయిచేసుకుని రాళ్ళు విసిరే యీ సంఘాన్నెదిరించి: పెళ్ళి వూసెత్తకుండా పండంటి పాపడిని కని; కష్టపడి పెంచి పెద్ద చెయ్యకపోతే నీకీరోజు ఒక ఆఫీసరు భర్త వుండేవాడు కాదు." అంది-వర్ధనమ్మగారి కళ్ళు వర్షిస్తున్నాయి—

శారదకు మాటలే కరువయ్యాయి!